## తత్త్వ–1

సతతం భజ సద్గురునాథం సద్గురునాథం గురువరదేవం ।
పాపారణ్యదవానల రూపం శంభుముమాపతి పరమేశం ॥

సకలసురాసుర భయహరదేవం నిర్మలనిత్య నిరాకారం ।
బ్రహ్మాద్యమర ప్రార్థితవంద్యం సర్వేశం సురలోకేశం ॥

సకలచరాచర భువనాధారం వేదవేద్య శివదృగ్రూపం ।
ఏకాకారం చిన్నభరూపం పరిపూర్ణం బ్రహ్మానందం ॥

నిర్మలనిర్గుణ నిత్యనిరంజన చైతన్యం హృదయాకాశం ।
సర్వజీవ హృదయాంతరవాసం కైలాసం చిత్సుఖదేశం ॥

దేహవిలక్షణ చిన్మయరూపం కైవల్యప్రద గురునాథం ।
ద్వంద్వాతీతం పరమగురుమహా దేవం శ్రీసద్గురునాథం ॥

## తత్త్వ–2

శరణుగురు మహాదేవ సర్వేశ్వర సదాశివ శంకరా ।
శరణు శ్రీగురునాథ సర్వాధార శ్రీగురుశంకరా ॥

శరణు నిజసుఖరూప నిత్యాఖండరూప మహేశ్వరా ।
శరణు మృత్యుంజయ సదాశివ స్వామి సద్గురుశంకరా ॥

శరణు పావనమూర్తి పరశివ దేవ గురువర శంకరా ।
శరణు సద్గురు దేవ విశ్వనియామక ప్రభుశంకరా ॥

శరణు మాయాతీత నిజసాక్షి స్వరూపా శంకరా ।
శరణు త్రిగుణాతీత విశ్వాతీత భేదభయంకర ॥



శరణు నిరఘనిరంజనాద్వయ దేవ శ్రీగురుశంకరా ।
శరణు నతజనపాల గురుమహాదేవ సద్గురు శంకరా ॥

## తత్త్వ–3

నిన్ను పొగడే భాగ్యమొసగుమురా ॥ మహదేవ నాకు ॥
భిన్నదేహమునేను కాదని । భిన్నదేహమునందువెలిగెడు ।
చిన్నయాత్ముడె నేననుచు నా । జన్మసార్థక మొంద జేసిన ॥

కన్నులందున జూచువాడెవడు । ఈ వీనులందున । అన్నిశబ్దములెరుగువాడెవడు ।
భిన్నభిన్నవిషయములెల్లను । తిన్నగానేనెరుగుచున్నను ।
కన్నవిషయము లంటకుండెడు । చిన్మయుడె నేననుచు దెలిపిన ॥

మూడుతనువులు నేను కాదనుచు । నేననుభవించెడు । మూడవస్థలు నాకు లేవనుచు ॥
మూడుమలముల మూడుగుణముల । కూడికూడక వెల్గుచుండెడు ।
వాడునిజసాక్షి స్వరూపుడు । వాడేనేనని బోధజేసిన ॥

సత్తుచిత్తానంద రూపుడని । నిజమెరుగనేనే । నిత్యనిర్మల శుద్ధబుద్ధుడని ॥
తత్త్వమసివాక్యార్థ మిదియని । తత్త్వమును బోధించినాకే ।
మర్త్యభావము బాపిశ్రీవర । మాత్ముడేనేననుచు దెలిపిన ॥

## తత్త్వ–4

ఊరక పరశివుడగునే । తాను । మీరక మాయను తన్నెరుగకనే ।

దేహమోహమును విడువక । తన్ను । కోహమనుచు తానుతనులోనెరుగక ।
సాహసపరుడై నిలువక । పర । బ్రహ్మానుసంధాను పరుడు తాకాకా ॥

ధ్యానము జేసిన రాదు । దేహ । మానాభిమానము తాపదలలేదు ।
కాననముల నున్నరాదు । శుద్ధ । జ్ఞానమె తానై నిలువకరాదు ॥

శిస్తుతో నడచినరాదు । తర్క । కుస్తీలగెల్చిన సాధ్యముగాదు ।
పుస్తకమున జిక్కబోదు । పర । వస్తువే తానై సుఖించక రాదు ॥

విరతిగట్టిగనిల్వలేదు । మది । కొరతలు మెండయి నిజమెరుగలేదు ।
మరణభీతియు పోవుటలేదు । నోట । పరమాత్మ తానన్న ఫలమేమిలేదు ॥

ఎరుకేతానై నిల్వలేదు । ఈ । కరణ కార్యముల నంటక నిల్వలేదు ।
పరమానందముపొందలేదు । సద్ । గురుమహాదేవుని తాజేరలేదు ॥

## తత్త్వ–5

హెచ్చరిక, హెచ్చరిక, హెచ్చరిక బహు హెచ్చరిక ।
విచ్చి కనులనీ నిద్రనుచాలించుము జీవా బహు హెచ్చరిక ॥

చచ్చి పుట్టు ఈ కాయముకాదని । సచ్చిత్సుఖ పరమాత్ముడు నేనని ।
సకల దృశ్యము మిథ్యంబనుచును । నిష్కళంక చిన్మాత్రుడు నేనని ॥

అన్నిటిజూచెడు వాడే నేనని । నన్ను జూచువాడెవ్వడు లేడని ।
అంతఃకరణపు వృత్తులచూచెడు । సత్యపూర్ణ పరంజ్యోతియు నేనని ॥

జాగ్రత్ స్వప్న సుషుప్తుల మూటిని । బాగుగ నెరిగెడు సాక్షియు నేనని ।
నిద్రలోన సర్వములీనంబగు । నిద్రను గెల్చిన ప్రభువే నేనని ॥

నిను నీవెరిగిన దృశ్యం బడగును । కనుమిదియే నీపూర్ణ భావమని ।
జడభావములను ఎరుగుచుండెడు। మృడుడే నేనని దృఢముగనమ్ముము ॥

రాగద్వేషములను చోరులు నీ । యోగ ధనంబును అపహరింతురిక ।
జీవుడు నేకాదనుచు గురుమహా । మృడుడే నేనని దృఢముగనమ్ముము ॥



## తత్త్వ–6

ఎన్నటికో । నాకెన్నటికో ।

ఎక్కడిబంధువు లెక్కడి మమతలు । ఎక్కడి మోహము లెక్కడిదుఃఖము ।
సతిసుతులను అభిమానము వదలుచు । సతతమునిన్నే చింతించుటనాకె ॥

ఎన్ని విధంబుల కర్మలపూజల । నెన్ని జేసినను శాంతియులేదే ।
మనసునసేవిధ విషయములెల్లను । మననము జేయకనెమ్మదిపొందుట ॥

వేదాంతార్థము లెన్నిదెలిసినను । నాదియనెడు అభిమానమువదలదు ।
దేహమునేనను మోహమువదలుచు । బ్రహ్మమెనేనని సుఖముగనుండుట ॥

ఎరుకమరపులను ఎరిగెడు ఎరుకే । గురుమహాదేవుని నిజరూపంబని ।
ఎరుకమరపులను ఎరిగెడు ఎరుకే । గురుమహాదేవుని నిజరూపంబని ॥

## తత్త్వ–7

ఎవరు ఎరుంగరు మావూరు । ఏ । చివర లేనిదే మావూరు ।
వివర మెరింగిన మావూరు । ఈ । భవులెరుంగనిది మావూరు ॥

చూపుకు చిక్కదు మావూరు । ఏ । రూపము లేనిది మావూరు ।
తాపమెరుంగదు మావూరు । పుణ్య । పాపములెరుగదు మావూరు ॥
భీరులెరుంగరు మావూరు । నిజ । ధీరుల కెరుకగు మావూరు ।
పారరహితమె మావూరు । సుఖ । సారమ్మైనదే మావూరు ॥

లక్ష్యమూలమే మావూరు । బహు । లక్షణమయినది మావూరు ।
సాక్షిగనున్నది మావూరు । ఈ । కుక్షిలోనున్నది మావూరు ॥

చీకటికావల మాపూరు । నాక । లోకులెరుంగరు మాపూరు ।
ఏకం బైనది మాపూరు । రాక । పోకల నెరుగదు మాపూరు ॥

వదలిన వదలదు మాపూరు । అన్ని । వదలగ మిగిలినదాపూరు ।
నిదురనెరుంగదు మాపూరు । యమ । బెదరునెరుంగదు మాపూరు ॥
మరపు నెరుంగదు మాపూరు । శుద్ధ । ఎరుకస్వరూపమె మాపూరు ।
గురుమహాదేవు నిదాపూరు । గురు । శరణుల భాగ్యంబాపూరు ॥

## తత్త్వ–8

చూడమ్మ చూడు పరమాత్ముని । నీలో । చూడమ్మ చూడు పరమాత్ముని ।

తనువున నుండువాడెవ్వడు । ఈ । తనువే నేననువాడెవ్వడు । మరి
తనువును వదలు వాడెవ్వడు । తానే । చిన్మయుడగుచును ఘనతేజ మైనాడు ॥

ఆహా చూడుము స్థూలదేహము । స్థూల । దేహమునందు లింగ దేహము । లింగ
దేహమునందు హేతు దేహము । మూడు । దేహములంటని శుద్ధ చైతన్యము ॥

తానీ తనువు కానేరడు । భిన్న । ధ్యానం బునకు చిక్క జాలడు । చూడు
తానే ఈరేడు లోకాధారుడు । సత్య । జ్ఞానానందుడై నిత్య పరిపూర్ణుడైనాడు ॥

పార రహిత సుఖరూపుడు । ఆ । కార రహిత నిర్వికారుడు । ఈ
శరీర మందున్న దేనినంటడు । తానే । ధీర శ్రీసద్గురు మహదేవుడే వీడు ॥

## తత్త్వ–9

శంకర ఇది ఎంతటి దౌర్భాగ్యముర । సంకటపరిహారక శ్రీ సద్గురు ॥



ఇంటిలోనిమృష్టాన్నము వదలుచు । ఇంటింటికి తా భిక్షమునెత్తెడు ।
శుంఠునివరి తననిజసుఖమెరుగక । కంఠశూలమగు కాంతలగోరుట ॥

తన నిజరూపము తానెరుగక । ఈ తనువేతానని భావించుచుమది ।
నినుమరచుచు నీమాయకు వశుడై । ధనవనితాదులు సుఖమని తిరుగుట ॥

చచ్చేవారిని జూచుచుతనలో । ఇచ్చవచ్చినెట్లెల్లను మెలగుచు ।
నిశ్చలముగ నీధ్యానముజేయక । చచ్చేటప్పుడు గడగడవణకుట ॥

వేదాంతార్థమునెల్లను దెలిసియు । బోధరూపుడై నిలువక నేనీ ।
భేదబుద్ధి చే కని సతిసుతులను । నాదినాదియనియభిమానించుట ॥

మూడుతనువులను మూడవస్థలను । కూడియు కూడకవెలుగుచు నుండెడు ।
వాడేనేనని దృఢముగనుండక । మూఢుడగుచు బహుచింతల మునుగుట ॥

గురుమహదేవా నీవేగతియని । పరిపరివిధముల నినువేడితిరా ।
మరణభీతి పోగొట్టుచు నీవే । కరుణ తోడననుగావుము దేవా ॥

## తత్త్వ–10

చూడు నీయనుభవ మిదిరా జూచే । వాడే నేనని నీవు నిశ్చయించుమురా ॥

కనులమధ్యను నీవు నిలిచి । నీవీ । తనువెల్ల వ్యాపించి తనువనియెంచి ।
కనివిషయము లనుభవించి । యున్న। ఘనజాగ్రమిది నీవు విశ్వుడనియెంచి ॥

తనునిద్రావశమున మరచి । కంఠ । మున నిల్చి మనసున నెల్లకల్పించి ।
ఘననీ తేజముచేత జూచి । స్వప్న । మనసిది నీవేతైజసుడని యెంచి ॥

వదలి స్వప్నావస్థ తాను । నిజ । హృదయమునందు ప్రాణమును జేరుచును ।
నిద్రించసుఖముగతాను । కను । మిది సుప్తియని నీవు ప్రాజ్ఞుడనుచును ॥

గురువనుగ్రహము బొందుచును । తానే । పరసచ్చిదానంద రూపుండనుచును ।
మరచి బాహ్యాభ్యంతరమును । శుద్ధ । ఎరుక తానై యున్న తుర్యమనుచును ॥

పరమాత్మతాననితలచి । తాను । పరమాత్ముడను మననంబును మరచి ।
గురుమహాదేవుడై నిలిచి । ఇది । తుర్యాతీతంబనుచును నిశ్చయించి ॥

## తత్త్వ–11

గురుసేవ కొన సాగలేదు । ఈ । మరణభీతియు పోలేదు ।
కరణధర్మములెల్ల మీరుచు । తా శుద్ధ । ఎరుక స్వరూపుండై తానిల్వలేదు ॥

విన్నతత్త్వము నిల్వలేదు । ముందిక । విన్నను ఫలమేమిలేదు ।
చిన్మయుడనుచును తన్నెరుగలేదు । జన్మమరణవారిధిని దాటలేదు ॥

కామాదులను వదలలేదు । తానా । భూమానందము బొందరాదు ।
నామరూపభ్రాంతి తావదలలేదు । స్వామి సదాశివుడైతా నిల్వలేదు ॥

నరుడు తానసుటపోలేదు । ఈకొరతలు తగ్గుటలేదు ।
విరతియు నిలువక కొరతలు తగ్గవు । గురుమహాదేవుని గుట్టెరుగ రాదు ॥

## తత్త్వ–12

శంకర గురుదేవా । జయ జయ । శంకర మహదేవా ।
శంకర నేనీకింకరుడను । యమ । కింకరులొసగెడు బాధల మాన్పుము ॥

చిన్ననాటినుండీ । దేవా । నిన్నువేడుకొంటి ।
ఎన్నివిధంబుల బ్రతిమాలినను । కన్నుదెరచినను జూడవు ఏలా ॥

దోషముజేసితిరా । నాపై । రోషము జేయకురా ।
దోషములెల్లను నాశముజేసెడు । ఈశుడ నీవని నమ్మితి దేవా ॥



మరణభీతిద్రుంచి । నాలో । దురభిమాన మణచి ।
కరణసాక్షియగు గురుమహదేవా । శరణుచొచ్చితి గావుము దేవా ॥

▼

## తత్త్వ–13

గురువే గతియను మనసా । తత్త్వ । గురుపాదములకంటె ఘనమేది మనసా ।

మరచుచు నిను తిరి గితివె । నేను । నరుడని మాంస కాయమునే నమ్మితివె ।
తరుణులపొందుకోరితివె । కోరి । పరిపరియోనుల పుట్టి చచ్చితివె ॥

ధనధాన్య బంధుభాగ్యములు । నీదు । ఘనత నెరుంగని మాయాకార్యములు ।
కొనలేని దుఃఖజాలములు । అందు । మనసుంటె తొలగవు బహుసంకటముల ॥

నిను నీవు ఎరుగు సాహసము । వదలి । కనబడుచుండునీ జడ దృశ్యచయము ।
మననింప నీకేమిఫలము । చూడు । నిను నీవు ఎరిగిన ఆనందమయము ॥

ఎరుకది శూన్యము కాదు । నిత్య । పరమానందమువట్టి మాటలరాదు ।
గురుతేమి యందగు బడదు । స ద్ । గురుమహాదేవుడన్యమునీకుగాదు ॥

## తత్త్వ–14

దేవునీవు భజించుమురా । ఇక । నీవు భజించి సుఖించుమురా ।
భావమునందున వెలుగుచునుండే । దేవుడె నీ నిజగతియని నమ్ముచు ॥

మోహము నీలో ద్రుంచుమురా । ఆత్మ । ద్రోహము మది నీవెంచకురా ।
సాహసమున వైరాగ్యముజెందుచు । వూహాలకందక మనసున వెలిగెడు ॥

మాయసంసారంబిదిగనరా । ఈ । మాయకుజిక్కి తపించకురా ।
కాయముకేవల  మాంసమయంబని । కాయమునమ్మక దేవుని నమ్ముచు ॥

నరులను మెచ్చిన యేమగురా । ఆ । పరముని మనసున మరవకురా ।
ఆనరులు మెచ్చిన మోక్షమునిత్తురె । పరముడు మెచ్చిన మోక్షమునివ్వడే ॥

బాహ్యమునందున దొరకదురా । హరి । నీ హృదయమునందుండునురా ।
దేహము మరచుచు హరినిభజించిన । శ్రీ । హరి నీలోవెల్గునురా ॥

సాకారము నైనను సరియె । ని । రాకారమునైనను సరియే ।
సాకారనిరాకారంబులు । ఆ । లోకేశ్వరునికి ఆకారములని ॥

ఆ మరణము నిను వదలదురా । అపు । డేమియు జేయగతోచదురా ।
ఏమరకుండగ నీ మది నిరతము । శ్రీ । మహదేవుడె నీ సద్గతియని ॥

## తత్త్వ-15

అంతా బ్రహ్మమయం బీజగమంతా బ్రహ్మ మయం ।
అంతఃకరణమనంతరూపముల । వింతగనగపడు నంతయుతానే ॥

జ్ఞానమె తానగురా । సర్వము । తానై యగబడురా ।
జ్ఞానమె తానీ మానసమగు నీ । మానసమే ఈ జగమై యగుబడు ॥

సాకారుడు తానే । శుద్ధ ని । రాకారుడు తానే ।
ఏకాకారుడు తానేనానా । యాకారములను పొందియు పొందడు ॥

అన్నియు తానగురా । తనకిక । అన్యంబుండదు రా ।
చిన్మయుడై తానన్నిట యుండును । అన్నిట నుండిన అంటకయుండును ॥

తానిరవయవుడురా । కావున । తానిష్క్రియుడగురా ।
తానేసర్వము జేసియజేయని । జ్ఞానానంద స్వరూపుండగురా ॥

సత్యస్వరూపుడురా । ఇది యది । మిథ్యాభూతమురా ।
అస్తిభాతిప్రియరూపుడు తానీ । మిథ్యాజగమున కాధారుండగు ॥



భిన్నమెరుగకుండు । కన్నను । కన్నులు లేకుండు ।
అన్యమెరుంగడు భీతినెరుంగడు । చిన్మయుడై గురుమహదేవుండై ॥

## తత్త్వ-16

మంగళం జయజయ మంగళం । శుభ । మంగళం శ్రీగురుదేవునకు ।

నేనీదేహము కాదు దేహవిలక్షణ । జ్ఞాన స్వరూపుడె నేననుచు ।
మానిన దేహాభి మానము లెల్లను । నేనె శివుండనిజూపిన గురునకు ॥

ప్రాణము లైదును పది ఇంద్రియ ములును । నేనెరుగుదు నవినన్నెరుగ వనుచు ।
మానస ధీవృత్తులను జూచు సాక్షియే । నేనని మర్మము జూపిన గురునకు ॥

విశ్వ తైజస ప్రాజ్ఞనామరూపుండే ఈ । దృశ్య విలక్షణ సాక్షి నేననుచు ।
పాశములెల్లను ద్రుంచినేనీ పంచ । కోశాతీతుండని జూపిన గురునకు ॥

జగమందు నేనని జగమిదినాయందు । తగనుండుననిమర్మమును జూపుచు ।
జగమిదినాయందు లేదని జూపించి । జగదాధారుని జూపిబ్రోచిన గురునకు ॥

ఎన్ని విధంబులనెన్ని జన్మంబుల । నెన్నితపంబులనాచరించితినో ।
అన్నిఫలించెను గురు మహాదేవుడై । నన్ను బోధించిన శ్రీ సద్గురునకు ॥

మంగళం దేశికేంద్రాయ నిర్గుణాయ మహాత్మనే ।
మంగళం దేవదేవాయ మహాదేవాయ మంగళం ॥